క్లుప్తంగా

చిన్నారుల కోసం రక్తదాన శిబిరం



తుమ్మలపాలెం(ప్రత్తిపాడు): స్థానిక మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, గుంటూరు సీజీఎస్టీ, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారి కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ మేదూరి భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపికృష్ణ పర్యవేక్షణలో 107 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కళాశాల సెక్రటరీ ఎంబీవీ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి కిషోర్ రక్తదానం చేసిన విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు. శిబిరంలో సీజీఎస్టీ సూపరింటెండెంట్లు డి.రామ్మోహన్ రెడ్డి, బీఎల్‌సీ శేఖర్ రెడ్డి, ఏఓ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి జయరావు మిరియాల పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



శలపాడు(చేబ్రోలు): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం కావడంతో బాధిత కుటుంబానికి నిత్యావసరాలు, నగదు సహాయాన్ని మంగళవారం అందజేశారు. సోమవారం రాత్రి నిర్వహించిన అగ్ని ప్రమాదంలో పులి అంకమ్మస్వామికి చెందిన పూరిల్లు, గడ్డివామి కాలిబూడిదైంది. సుమారు రూ.లక్షన్నర ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదంలో పశువులు, ఆవులకు స్వల్ప గాయాలవటంతో పశువైద్యశాఖ సిబ్బంది వైద్య సేవలు అందజేశారు. ప్రమాద బాధిత కుటుంబాన్ని తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి నగదు ఆర్థిక సహాయం, బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందే సహాయ సహకారాలను త్వరతగతిన అందే విధంగా కృషి చేయనున్నట్లు నాయకులు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మన్నెం వేణుగోపాలరావు, ఉయ్యూరు బాలచంద్రయ్య పాల్గొన్నారు.

పురుగుమందు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పట్నంబజారు: అనుమతి లేకుండా పురుగుల మందు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు అయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఏటుకూరు రోడ్డులోని విష్ణుప్రియ కాంప్లెక్సులో కోటపాటి కోటేశ్వరరావు ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా పురుగు మందులతోపాటు, పలు ద్రావకాలు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అగ్రికల్చర్ అధికారి పి.కిషోర్ తనిఖీ చేశారు. అనుమతులు లేని పలు పురుగుల మందులు స్వాధీనం చేసుకుని కిషోర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో క్యాన్సర్‌కు ఆధునిక వైద్యం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ కేంద్రంలో అంతర్జాతీయ స్థాయిలో వైద్యం అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవాల సందర్భంగా చలపతి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ మహిళలను కబలిస్తున్నప్పటికీ చక్కని వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై మహిళల్లో అవగాహన లేకపోవడం వలన ఆసుపత్రులకు ఆలస్యంగా వస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది మహిళలు భయపడటం, బయట చెప్పుకోలేక పోవడం వలన సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. వైద్యులు ప్రాథమికంగా వ్యాధి నిర్ధారణ చేసి వైద్యం అందిస్తే విముక్తి పొందవచ్చన్నారు. ప్రతి మహిళా రొమ్ము క్యాన్సర్ ఉందా లేదా అని తెలుసుకునేందుకు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రొమ్ము క్యాన్సర్ చికిత్స జీజీహెచ్‌లో కిమో థెరపి, రేడియో థెరపి, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. త్వరలో పెట్ స్కాన్ రాబోతున్నట్లు వెల్లడించారు. పెట్ స్కాన్ వల్ల రోగి శరీరంలోని క్యాన్సర్ లక్షణాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పరీక్షకు ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.25 నుంచి రూ.30వేల వరకు తీసుకుంటారని తెలిపారు. క్యాన్సర్ సెంటర్‌కు నూతనంగా 118 పోస్టులు మంజూరు అయినట్లు వెల్లడించారు. క్యాన్సర్ సెంటర్‌కు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి నాట్కో కేంద్రానికి అవసరమైన నిధులను, నియామకాలను చేపట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. ర్యాలీలో క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ దుర్గా ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాహ్నవి, డెప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ బత్తుల వెంకటసతీష్ కుమార్, డాక్టర్ రామారావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

- గ్రామాల్లో ముగిసిన శిబిరాలు
- వైద్యసేవలు అందుకున్న 4,215 ప్రజలు
- శిబిరానికి హాజరై సేవలందించిన స్పెషలిస్టు వైద్యులు



నేత్ర పరీక్షలు చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారు. ఇప్పటికే నాడు– నేడుతో వైద్య ఆరోగ్యశాఖలో విప్లవాత్మక మార్పులను అమలు చేస్తున్న జగన్ సర్కార్ పేదల ఆరోగ్యంపైనా మరింత దృష్టి సారించింది. ఇంటింటికీ వెళ్లి అనేక సార్లు జ్వరాల సర్వేతో ప్రజల నాడి పట్టిన వైద్య ఆరోగ్య శాఖ, ఆ తరువాత ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఊరూరా విస్తృత వైద్య సేవలు అందించింది. మంచంలో ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించింది. తాజాగా నెల రోజులుగా ఊరూరా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రజలకు మరింత ఖరీదైన కార్పొరేట్ స్థాయి వైద్యం తమ గ్రామంలోనే స్పెషలిస్టు వైద్యులతో అందించింది. సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జరిగిన శిబిరాలు ముగిశాయి. ఇప్పటి వరకు శిబిరాలకు గ్రామీణ ప్రాంత ప్రజలు వేల సంఖ్యలో హాజరయ్యారు. వీరికి అక్కడికక్కడే ఏడు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి, వ్యాధులను నిర్ధారించారు.

ఆరోగ్య సురక్ష వివరాలు ఇలా..

మండలంలోని పెదగొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శిబిరాలకు 2011 మంది రోగులు హాజరయ్యారు. వారిలో తీవ్ర అనారోగ్య సమస్యలున్న 96 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అదే విధంగా ప్రత్తిపాడులోని పీహెచ్‌సీ పరిధిలో 2,204 మంది రోగులు శిబిరానికి హాజరవ్వగా, వారిలో 152 మందిని రెఫర్ చేశారు. శిబిరంలో స్పెషలిస్టులు డాక్టర్ అంజనీదేవి (స్త్రీ ప్రసూతి వైద్య నిపుణురాలు), డాక్టర్ ముఖేష్ కుమార్(చిన్నపిల్లల వైద్య నిపుణుడు), సయ్యద్ షబర్(నేత్ర వైద్య నిపుణుడు), డాక్టర్ కెజియాగ్రేస్(జనరల్ వైద్యాధికారి), డాక్టర్ దివ్య మేఘన(జనరల్ వైద్యాధికారి) వైద్యసేవలు అందించారు.

సమష్టి కృషితో సమన్వయంతో..

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సమష్టి కృషి విజయవంతంగా నిర్వహించారు. తొలుత వలంటీర్లుతో సర్వే ప్రారంభమైన నాటి నుంచి సర్వే ప్రక్రియ అంతా పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులు, సూపర్‌వైజరీ స్టాఫ్ నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చారు. క్యాంప్ జరగనున్న గ్రామంలో పదిహేను రోజుల ముందుగానే క్యాంప్‌లు, గృహ సందర్శనలతో ప్రజల ఆరోగ్య సమాచారాన్ని సేకరించి, వారికి ముందుగానే ఓపీ స్లిప్పులను అందజేశారు.

వృద్ధులకు వరంలా నేత్ర పరీక్షలు..

క్యాంపుల్లో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాలు వృద్ధులకు వరంగా మారాయి. ఆరు పదులు దాటిన వృద్ధులు వందల సంఖ్యలో శిబిరాలకు హాజరై నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. తీవ్ర సమస్యలున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. ఇప్పటి వరకు కొంత మందికి కళ్లజోళ్లు ఇచ్చినప్పటికీ, మరి కొంత మందికి కూడా త్వరలోనే అందించనున్నారు.

పెదకాకాని రైల్వేగేటు వద్ద తొలగనున్న ట్రాఫిక్ కష్టాలు



పెదకాకాని రైల్వేగేటు వద్ద నిలిచిపోయిన వాహనాలు



మట్టి పరీక్షలకు డ్రిల్ చేస్తున్న సిబ్బంది

పెదకాకాని: రైల్వేగేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జికి గ్రీన్ సిగ్నల్ లభించడంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. పెదకాకాని సెంటర్ నుంచి వెనిగండ్ల వెళ్లే మార్గంలో 24 గంటల వ్యవధిలో సుమారు 80 రైళ్లు ప్రయాణిస్తుంటాయి. రైల్వే గేటు నిరంతరం పడుతుండటంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం డబుల్ లైన్, అంతకు మించి లైన్లు ఉన్న ప్రతి చోట గేటు స్థానంలో బ్రిడ్జిలు నిర్మించాలనే నిర్ణయంతో ఇప్పటికే కొప్పురావూరు వెళ్లే మార్గంలో అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలు కూడా కొనసాగుతున్నాయి. పక్కనే ఉన్న కంతేరు మార్గంలోని అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణదశలో ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా పెదకాకాని రైల్వేగేటు వద్ద బ్రిడ్జి నిర్మించేందుకు మట్టి నమూనాలు సేకరించే పనిలో కార్మికులు ఉన్నారు. మట్టి నమూనాల సేకరణ, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం, ఉన్నతాధికారుల నుండి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించడం జరుగుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళి

పెదకాకాని: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని లూథర్‌గిరికాలనీలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కంతేటి యలమందరావు మాట్లాడుతూ ఇందిరా బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. పేదలకు ఐదు సెంట్లు ఇంట స్థలం మంజూరు చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతోందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చినపోలిరెడ్డి, షేక్ నాగుల్‌మీరా, దిలీప్, కండెల నాగరాజు, బత్తుల దాసు, కోలాటపు స్వామి పాల్గొన్నారు.

ఉనికి కోసం టీడీపీ పాట్లు



పొన్నూరు: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర తన ఉనికిని చాటుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్కెట్‌యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్షాలు లేనప్పటికీ పంటలకు సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం పంట భూములకు నీటి కొరత లేదని, కాలువల్లో నీరు పుష్కలంగా ఉందని, కాలువ చివరి భూముల వరకు నీరు అందుతుందని తెలిపారు. ఎమ్మెల్యే రోశయ్యను కించపరిచే విధంగా వ్యాఖ్యలు, నిరాధారమైన ఆరోపణలు చేయడాన్ని నరేంద్ర ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు షేక్ అల్లాబక్షు, పార్టీ రూరల్ అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు లింగం మనోహర్, వేములు మూర్తి రాజు, దేవరకొండ గోపి, గోపిశెట్టి వాసు, నాగిశెట్టి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వివాలో ఫిట్ ఇండియా 4కే పరుగు

పెదకాకాని: విద్యార్థులు సోదర భావంతో ముందుకు సాగుతూ సమైఖ్యతను చాటాలని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నంబూరు వివా ది స్కూల్‌లో మంగళవారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని 4కే నాలుగు కిలోమీటర్లు క్రాస్ కంట్రీ పరుగు పందెం నిర్వహించారు. వివా ప్రాంగణం నుంచి గోళ్లమూడి గ్రామం మీదగా పరుగుపందెం సాగింది. వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వ్యాయామం, పరుగును ప్రతిరోజు దినచర్యలో భాగంగా చూసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమములో పాఠశాల డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ పాల్గొన్నారు. సీబీఎస్ఈ సంధానకర్త జ్యోతి మెటిల్డా, ఐబీ సంధానకర్త కె.మాధవి పాల్గొన్నారు.



పరుగును జెండా ఊపి ప్రారంభిస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

కార్మికులకు అండగా ఏఐటీయూసీ

ప్రత్తిపాడు: కార్మిక లోకానికి అండగా ఏఐటీయూసీ పోరాటం చేస్తోందని సీపీఐ ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు అన్నారు. సంఘం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురు ఉన్న కార్మిక సంఘాల జెండాను ఆయా సంఘాల నాయకులతో కలసి ఏఐటీయూసి నియోజకవర్గ కార్య దర్శి కుంచాల అంకమ్మరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి మేడ తాతారావు, భవన నిర్మాణ కార్మిక కార్యదర్శి గోపిరెడ్డి నాగిరెడ్డి, రిక్షా కార్మికుల యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి ఏడుకొండలు, సహాయ కార్యదర్శి ఎస్.అంజిబాబు, మండల కార్యదర్శి ఎం.అంకమ్మరావు, వివిధ సంఘాల నాయకులు భాస్కర్, రవి, యూనియన్ నాయకులు యలవర్తి సాంబయ్య, షేక్ మీరా సాహెబ్ పాల్గొన్నారు.



కార్మిక సంఘాల నాయకులతో కలసి జెండా ఆవిష్కరిస్తున్న ఆదేశ్వరరావు, అంకమ్మరావు తదితరులు

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

పెదకాకాని: ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం పెదకాకానిలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మంగళవారం జరిగినఈ కార్యక్రమానికి పెదకాకాని గ్రామ సీపీఐ కార్యదర్శి పాటిబండ్ల డేవిడ్‌రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్లను వెంటనే ఎత్తివేయాలని కార్మికులకు రక్షణ చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ వెనిగండ్ల గ్రామ కార్యదర్శి బుల్లా బాబూరావు మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, దర్శి లింగారావు, రామిశెట్టి శ్రీనివాసరావు, గోపి సుబ్బారావు, బి.వీరయ్య, ఆర్.మోజేష్ బాబు, ఆటో యూనియన్ అధ్యక్షులు నాదు సత్యనారాయణ, కార్యదర్శి బుల్లా సురేష్, గజ్జల శ్రీనివాసరావు, కూచిపూడి సింహరాయలు పాల్గొన్నారు.

నాణ్యతలో అగ్రగామి భారతి సిమెంట్

పెదనందిపాడు: భవన నిర్మాణాలు శాశ్వత మైనవని, నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంట్ ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) పూల రమేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్.భవాని శంకర్ సూచించారు. మంగళవారం రాత్రి ముంతాజ్ ఐరన్ అండ్ హార్డ్‌వేర్స్ సహకారంతో పెదనందిపాడులో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని తెలిపారు. కట్టడాలు, పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడతాయని వివరించారు. సిమెంట్ తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుదని చెప్పారు.

భవానీశంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్ తో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యత పరీక్షలను చేసి భారతి సిమెంట్ నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యాజమానులకు వివరిస్తామని చెప్పారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. సేవలను వినియోగించుకోవాలని కోరారు. సదస్సులో ముంతాజ్ ఐరన్ అండ్ హార్డ్‌వేర్స్ యాజమానులు షేక్ హసన్ సాహెబ్, షేక్ నాగూర్‌బి పాల్గొన్నారు.



మేస్త్రికి బీమా బాండ్ అందజేస్తున్న హసన్ సాహెబ్, భవానీ శంకర్

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాక్రమణను ఆపేయాలి

లక్ష్మీపురం: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాక్రమణని తక్షణమే ఆపేయాలని పౌరుల హత్యలు దమన కాండకు ముగింపు పలకాలని విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య విజ్ఞప్తి చేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం విద్యావేత్తలు, విశ్లేషకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గాజాపై ఇజ్రాయెల్ దళాలు తీవ్రస్థాయిలో దాడులు జరుపుతున్నాయని, ఇప్పటికే పాలస్తీనాలో మృతుల సంఖ్య 8వేలకు పైగా చేరిందన్నారు. అమాయక ప్రజలు, ముక్కుపచ్చల్లారని చిన్నారులు ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోవడం ప్రపంచాన్ని కలచి వేస్తోందన్నారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.రవిబాబు, సంస్థ సీనియర్ సభ్యులు చంద్రయ్య ప్రసంగించారు.

ప్రతిభకు మార్కులు ఒక్కటే కొలమానం కాదు

ప్రాంతీయ అగ్నిమాపక శాఖాధికారి జిలానీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లోని ప్రతిభకు మార్కులు ఒక్కటే కొలమానం కాదని ప్రాంతీయ అగ్నిమాపక శాఖాధికారి ఎంఏక్యూ జిలానీ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన లలితకళా, విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన అన్ని అంశాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. అనంతరం జిలానీ మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు చదువు ఒక్కటే సరిపోదని, వికాసంతో కూడిన సంపూర్ణ పరిజ్ఞానం ఉండాలని అన్నారు. ఇందుకు నిదర్శనంగా బాలకుటీర్ యాజమాన్యం విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దుతూ ముందుకు నడిపిస్తోందని పేర్కొన్నారు. సామాజిక సమస్యలను ఎదుర్కొనేందుకు ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం ఉండాలని, అవి విద్యలో భాగంగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి డాక్టర్ మంగాదేవి గారు, సహకార్యదర్శి జయశ్రీ, సీఏఓ రఘురాం, ప్రిన్సిపాల్ సుధామాధవి పాల్గొన్నారు.

ఓటరు ముసాయిదాపై అభ్యంతరాలకు అవకాశం

గుంటూరు ఆర్డీఓ శ్రీకర్

ప్రత్తిపాడు: ప్రచురించిన ఓటర్ల ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా అధికారులకు తెలియజేయాలని గుంటూరు ఆర్డీఓ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌ఓలతో వేర్వేరుగా సమావేశాలు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఓటర్ల ముసాయిదా జాబితాలను ప్రచురించినట్లు చెప్పారు. ఒక్కసారి అన్ని రాజకీయ పార్టీల నాయకులు ముసాయిదా జాబితాలను పరిశీలించి, అభ్యంతరాలుంటే సంబంధిత తహసీల్దార్ల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అభ్యంతరాలను తెలియజేసేందుకు డిసెంబరు 9వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన, విచారణ అనంతరం జనవరి ఐదో తేదీ తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని శ్రీకర్ వివరించారు.

నోటి మాటలతో కాదు..

తొలుత బీఎల్‌ఓలతో ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా చేపట్టిన ఓటర్ల జాబితా సవరణలో ఎదురవుతున్న సమస్యలపై ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలన్నారు. నోటి మాటలతో చెప్పి వదిలెయ్యడం కాదని, ప్రతి సమస్యనూ పేపర్‌పై ఉంచి లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఆదేశించారు. అదే విధంగా బీఎల్‌ఓలు ప్రతి సమావేశానికి హాజరు కావాలని సూచించారు. సంబంధిత బాధ్యులే హాజరైతే సమస్యలను చెప్పేందుకు గానీ, వాటిని పరిష్కరించేందుకు గానీ వీలు ఉంటుందన్నారు. అభ్యంతరాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు నవంబరు 3, 4, డిసెంబరు 4, 5 తేదీల్లో నిర్వహించనున్న స్పెషల్ క్యాంపెన్ డేస్‌లో ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాల్గొనాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్ తహసీల్దార్లు జి.సిద్ధార్థ, నాసరయ్య, సుభాని, ప్రసాద్, సాంబశివరావు నగేష్ హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు ఆర్డీఓ శ్రీకర్, పక్కన ఐదు మండలాల తహసీల్దార్లు

వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి

గుంటూరు రూరల్: భారతదేశ సమైక్యత సాధనలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి మరువలేనిదని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు మాట్లాడుతూ భారతదేశంలో సంస్థానాలను విలీనం చేసి భారతీయ సమైక్యతకు తనదైన ముద్రను ఆయన వేశారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ భారతదేశం ఐక్యత, సమగ్రత భద్రతను పరిరక్షించడంపై కార్యక్రమంలో పాల్గొన్న అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం దేశ సార్వభౌమత్వం, ఐక్యతను పెంపొందించడానికి వివిధ రకాల నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ జాతీయ జెండాలతో ఏక్తా వాక్ ర్యాలీని కళాశాల కూడళ్లలో నిర్వహించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ భారత దేశ తొలి ఉప ప్రధాన మంత్రి, తొలి హోంశాఖ మంత్రిగా పని చేసిన సమయంలో అనేక కీలక నిర్ణయాలను తీసుకుని దేశ అభ్యున్నతికి అనేక విప్లవాత్మక మార్పులకు ఆయన శ్రీకారం చుట్టారన్నారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలకు చిహ్నంగా 182 మీటర్లు కలిగిన భారతదేశంలోనే అత్యంత ఎత్తైన విగ్రహ నిర్మాణం, ఐక్యతా ప్రతిమకు ప్రతిరూపమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డాక్టర్ ఎ.సుధాకర్, డాక్టర్ జీ రామ్‌మోహన్‌బాబు, డాక్టర్ వి.రామకోటేశ్వరరావు, డాక్టర్ రాధిక తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఏక్తా దివస్

ప్రత్తిపాడు: మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏక్తా దివస్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 31న రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యత దినోత్సవం)ను నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో మంగళవారం ఉదయం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యూనిటీ రన్‌లు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేశారు. యనమదల ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం జయ రత్నకుమార్ ఆధ్వర్యంలో యూనిటీ రన్ చేపట్టారు. పెద గొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం.చంద్రశేఖర్ నేతృత్వంలో జాతీయ సమైఖ్యత ర్యాలీ జరిపారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద చేయి చేయి కలిపి విద్యార్థులు మానవహారంగా ఏర్పడి జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. ప్రత్తిపాడు హెచ్ఈ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అసెంబ్లీ సమయంలో ప్రతిజ్ఞ చేసిన అనంతరం యూనిటీ రన్ నిర్వహించారు. ఐక్యతతో పాటు మన దేశం యొక్క సమగ్రత, భద్రతను పరిరక్షించడానికి, బలోపేతం చేయడానికి మనలో అంకితభావాన్ని పెంపొందించడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని హెచ్‌ఎంలు విద్యార్థులకు వివరించారు.

చలపతి ఫార్మసీలో...

గుంటూరు రూరల్: సర్దార్ వల్లభాయ్‌పటేల్ చేసిన కృషి ఎనలేనిదని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. నగర శివారుల్లోని లాం కళాశాలలో నిర్వహించిన జాతీయ ఐక్యత దినోత్సవ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ రాజకీయ ఏకీకరణలో ప్రధాన పాత్ర పోషించిన ఆయన ప్రతి ఒక్కరికి మార్గదర్శకమన్నారు. ఆయన జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా జరుపుకోవటం సంతోషకరమన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు, యాజమాన్యం ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ కేఎస్ రజనీకాంత్, జి.నాగరాజు పాల్గొన్నారు.

చిప్స్ కళాశాలలో..

గుంటూరు రూరల్: ఐక్యమత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో జరిగిన ఐక్యత దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యం సమైక్యత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాగంగా సమైక్యత ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జె.సుబ్బారావు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులలో..

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి సర్దార్ వల్లభాయ్‌పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఐక్యమత్యంతో నడవాలని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. మంగళవారం పెదపలకలూరులోని కళాశాలలో రాష్ట్రీయ ఐక్యత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతదేశ మాజీ హోంమంత్రి, జయంతిని పురస్కరించుకుని ఐక్యత దినోత్సవాన్ని జరుపుకోవటం సంతోషకరమన్నారు.



ఏక్తాదివస్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు



పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ



యనమదల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల యూనిటీ రన్



ఐక్యత ర్యాలీ నిర్వహిస్తున్న చలపతి విద్యార్థులు



చిప్స్‌లో సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల యాజమాన్యం



విజ్ఞాన్ నిరులలో ఐక్యత ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు